www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 13 జులై 2023

5

అన్నమయ్య

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన సంఘటన బి.కొత్తకోట పట్టణం ఇందిరమ్మ కాలనీ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. బి.కొత్తకోట-పిటిఎం రోడ్డులో ఓ జింక మృతి చెంది రోడ్డు పక్కన పడి ఉండగా స్థానికులు గమనించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. వాహనదారులు వాహనాలను నిదానంగా నడపాలని, వణ్యప్రాణులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అటవీ శాఖ అధికారులు పేర్కొన్నారు. జింకకు అక్కడే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.

మృతి చెందిన జింక

కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలి

- డిఎల్‌పిఒ కార్యాలయం ఎదుట నిరసనలో నాయకులు

డిఎల్‌పిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామ పంచాయతీ కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. స్థానిక సిటిఎం రోడ్డులోని డిఎల్‌పిఒ కార్యాలయం ఎదుట ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికులకు చేపట్టిన నిరసనకు రవాణా ట్రాన్స్ ఫోర్ట్ జిల్లా నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు 2012 నుంచి ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని ఆదేశాలు ఉన్న ఎక్కడ అమలు చేయలేదన్నారు. 2019లో జిఒ నెంబర్ 57, 132లలో ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, బ్యాంక్ ద్వారా జీతాలు ఇవ్వాలని ఆదేశాలు ఉన్న ఇప్పటివరకు మండనపల్లె రూరల్ గ్రామ పంచాయతీలలో కార్మికులకు ఎవరికి అమలు చేయలేదన్నారు. గతంలో డిఎల్‌పిఒకు చాలా పర్యాయాలు నోటీసు ఇచ్చామని, అయినా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు 2015లో గౌరవ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు కూడా పక్కన పెట్టి కార్మికుల దగ్గర శ్రమ దోపిడీ చేయించుకుంటూ, కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా చాలా అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా మదనపల్లె డివిజన్ పంచాయతీ అధికారి వారు స్పందించి మదనపల్లి రూరల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలోని కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సురేంద్ర బాబు, జిల్లా నాయకులు ఎం.నాగరాజు, ప్రమీలమ్మ, శ్యామలమ్మ, మండల నాయకులు రవి, గోపాలు, మదనపల్లి రూరల్ మండలం అన్ని గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు : 'గడికోట'

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 20వ సచివాలయం 27వ వార్డు పరిధిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా హరినాథవీధి, త్యాగరాజవీధి, కంసలవీధి, దిబ్బలబడి పాత పోస్ట్ ఆఫీసువీధిలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల రారాజు సిఎం జగన్ అని పేర్కొన్నారు. గడప గడపకూ సంక్షేమ పథకాలు అందివ్వాలన్నదే సిఎం ఆశయమన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, ప్రజలుతో మమేకమవుతూ, సమస్యల పరిష్కార దిశగా గడప గడపకూ వెళ్లారు. పాత రాయచోటికి చెందిన ముదిరినేము ఎల్లయ్య అనే విభిన్నప్రతిభావంతునికి మూడు చక్రాల ట్రై సైకిల్‌ను ఎమ్మెల్యే అందచేశారు. నాయీ బ్రాహ్మణల సంక్షేమం కోసం జగన్ ప్రభుత్వం కృషి చేసిందంటూ త్యాగరాజ వీధి నాయీ బ్రాహ్మణులు శ్రీకాంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చేదోడు కింద షాపులున్న నాయీ బ్రాహ్మణులకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందుతుండడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, మున్సిపల్ రెవెన్యూ అధికారి మల్లికార్జున, స్థానిక కౌన్సిలర్ పల్లా మాధవీ లత, పల్లా రమేష్, సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ బయారెడ్డి, సంఘ సేవకులు లయన్ తులసీశ్వర్‌రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, కొలిమి ఛాన్ బాష, ఫయాజ్ అహమ్మద్, షబ్బీర్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, జానం రవీంద్ర యాదవ్, మహేష్ రెడ్డి, గౌస్ ఖాన్, అల్తాఫ్, అన్నా సలీం, కో-ఆప్షన్ అయ్యవారు రెడ్డి, హజరత్ ఖాదర్ వలీ, భాస్కర్, జిల్లా వ్యవసాయ సలహా సంఘ సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, నవరంగ్ నిస్సార్, కొత్తిమీర ప్రసాద్,మాజీ కౌన్సిలర్ ఆనంద రెడ్డి, గంగిరెడ్డి, వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, రియాజుర్ రెహమాన్, కొత్తపల్లె ఇంతియాజ్, ముదిరాజ్ యువసేన జిల్లా అధ్యక్షుడు విక్కీ దేవేంద్ర,డీలర్ నాగేంద్ర, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి :'చొప్పా'

రాజంపేట అర్బన్: బాలికలు బాలురతో సమానంగా అన్ని రంగాలలో రాణించాలని అన్నమాచార్య కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి తెలియజేశారు. అంతర్జాతీయ మలాల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో టచ్ స్టోన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని అన్ని తరగతుల విద్యార్థులకు బాలికల విద్య సమ సమాజ స్థాపన అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సఫ్రాన్ ఫాతిమ మొదటి బహుమతి సాధించగా, ఎం.ప్రసన్న ద్వితీయ బహుమతి, యు.హారిక తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి నారాయణలు ప్రతిభ చాటిన విజేతలను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో బాలురతో సమానంగా బాలికలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, మలాల బాలికల విద్యకోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. బాలికలు ప్రతి ఒక్కరూ విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించి దేశానికి మరింత పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎండిఎస్ విభాగాధిపతి డాక్టర్ బి.బాలనాగేంద్ర ప్రసాద్, టచ్ స్టోన్ కో-ఆర్డినేటర్ పి.విజయ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

20న 'కథ చెబుతారా ఊకొడతాం'

రాజంపేట అర్బన్ : ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుండి రాజంపేట పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'కథ చెబుతారా ఊకొడతాం" అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిటిడి జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపి బాబు చెప్పారు. బుధవారం స్థానిక ఆంజనేయ స్వామి దేవస్థానంలో వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులతో కార్యక్రమ నిర్వహణ విషయమై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 సంవత్సరాలలోపు బాల బాలికలు ఒక విభాగంగా, 15 సంవత్సరాలలోపు వారు ఒక విభాగంగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఒక్కో పాఠశాల నుంచి ఒక్కో విభాగానికి ముగ్గురు చొప్పున విద్యార్థులు హాజరు కావచ్చన్నారు. ధర్మార్థ కామ, మోక్షాలను వివరించే హిందూ ధార్మిక గ్రంథాలైన భారత, భాగవత, రామాయణ గ్రంథాలలోని కథలు, పంచతంత్రంలోని కథలు విద్యార్థులు చెప్పాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు హాజరు కావచ్చన్నారు. ఆయా విభాగాలలో గెలుపొందిన వారికి వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.వెయ్యి, రూ.750, రూ.500 అందజేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, ఆధ్యాత్మిక ప్రవచకులు కొత్త నరసింహులు, శ్రీ భగవాన్ గీత సేవా సత్సంగం అధ్యక్షులు మునీశ్వర్ రెడ్డి, శ్రీవారి భక్త సేవాసమితి ఉపాధ్యక్షులు నాగా వేణుగోపాలరెడ్డి, ఉపన్యాసకులు రంగస్వామి, ఆలయ అర్చకులు రవి స్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిటిడి ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపిబాబు

లైన్ సోయింగ్‌తో వరి పంటలో అధిక దిగుబడి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రకృతి వ్యవసాయంలో లైన్‌సోయింగ్‌లో వరినాట్లు వేయడం వలన వరి పంటలో అధిక దిగుబడి వస్తుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పెద్ద రెడ్డెయ్య అన్నారు. బుధవారం మండలంలోని టి.సాకిరేవుపల్లిలో రైతు చంటి ఎకరం పొలంలో వరి నారు కొసలు తుంచి బీజామృతంతో నారు శుద్ధి చేసి లైన్ సోయింగ్‌లో నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో రైతులు లైన్ సోయింగ్ ద్వారా నాటడం వలన పంటలో తెగుళ్ల బెడద తగ్గి, దోమపోటు లేకుండా పిలకలు బాగా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వినోద్, భాస్కర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవాలి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

విద్యార్థులు కలలు కనాలని, కష్టపడి చదివి ఆ కలలను సాకారం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ నాగమణి సూచించారు. బుధవారం స్థానిక సాయి విద్యానికేతన్ హైస్కూల్ నందు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి కరెస్పాండెంట్ మోడెం శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ నాగమణి, గౌరవ అతిథులుగా మదనపల్లె లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, మదనపల్లె జోన్ ఫారెస్ట్ ఆఫీసర్ మధుసూదన్, స్కూల్ అకాడమిక్ ఇన్‌ఛార్జి రమ్య హాజరయ్యారు. 2022-23 విద్యా సంవత్సరంలో 575 మార్కులకంటే అధికంగా సాధించిన విద్యార్థులకు రూ.పది వేల నగదు ప్రోత్సాహక బహుమతితోపాటు సిల్వర్ మెడల్స్‌ను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. పదవ తరగతిలో 579 మార్కులు సాధించిన నవ్య శ్రీకి రూ.10 వేల చెక్కు, సిల్వర్ మెడల్‌ను బహూకరించారు. ఉమామహేష్, హేమంత్, జస్వంత్, రిష్మా, పవన్ తదితర విద్యార్థుల తల్లిదండ్రులకు సిల్వర్ మెడల్స్‌ను అతిథులు చేతుల మీదుగా అందజేశారు. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డప్ప, మహబూబ్ బాషా, రఘు, యుగంధర్, చాంద్ బాషా, బిలాల్, గౌతమి, మూర్తి, హసీనా, లక్ష్మి, సుగుణ, పుష్ప, శ్రీదేవి, ప్రవల్లిక విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రం వెనుకబాటు : టిడిపి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రం వెనుకబడిపోయిందని టిడిపి నాయకులు అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భవిష్యత్తుకు బ్రహ్మరథం బస్సుయాత్ర పీలేరు నుంచి బుధవారం రాజంపేటకు చేరుకుంది. రాజంపేట పురవీధులలో పసుపుదళం పోటెత్తింది. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రైల్వేకోడూరు, వీరబల్లి, రాజంపేట, నందలూరుకు చెందిన పార్టీ ఇన్చార్జులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులతో ఎస్సార్‌పాలెం వద్ద ప్రారంభమైన ఈ యాత్రలో టిడిపి అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని 2024లో అధికారం తమదేనన్న ధీమాను వ్యక్తం చేశారు. ఎస్ఆర్ పాలెం నుంచి యాత్ర కూచివారిపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించి భోజనానంతరం తిరిగి యాత్రను ప్రారంభించి పాత బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకొని పూలమాలతో నివాళులర్పించారు. అక్కడి నుంచి యాత్రను తిరిగి ప్రారంభించి బోయిన పల్లిలో పెద్ద ఎత్తున బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ యాత్రతో తెలుగు తమ్ముళ్లలో నూతనోత్సాహం పుంజుకుంది. ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ఒడిసి పట్టుకోవడంలో ఈ యాత్ర విజయవంతమైందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. యాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సిఐ పుల్లయ్య, పట్టణ ఎస్ఐలు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు అడుగడుగునా నిఘా ఉంచుతూ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమేనని తెలిపారు. ఇందుకు నిదర్శనం ఈ జన సందోహమేనన్నారు. జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ టిడిపి ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ప్రజలు స్వాగతిస్తున్నారని, ప్రజలు యాత్రకు నీరాజనం పలుకుతున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని., ప్రజలు టిడిపికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జోన్-4 పరిధిలోని చిత్తూరు, రాజంపేట, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి పార్లమెంటులోని అసెంబ్లీ నియోజకవర్గాలఇన్‌ఛార్జులు, పార్లమెంటు అధ్యక్షులు పాల్గొన్నారు.

బస్సు యాత్రలో పాల్గొన్న టిడిపి శ్రేణులు

సాంకేతిక విద్యకు ప్రాధాన్యత

- జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలకు గ్రీన్‌సిగ్నల్
- మైదుకూరుకు పాలిటెక్నికల్ కళాశాల
- మంత్రివర్గ సమావేశంలో పలు సంక్షేమ నిర్ణయాలు

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

ప్రభుత్వం సాంకేతిక విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో సాంకేతిక కళాశాలల ఏర్పాటుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకున్నారు. అన్నమయ్య జిల్లాకు స్కిల్‌డెవలప్ మెంట్ కళాశాలలు, కడప జిల్లా మైదుకూరుల్లో పాలిటెక్నికల్ కళాశాలల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇటీవలి కడప జిల్లా పర్యటనలో భాగంగా పులివెందుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనికి అదనంగా మరొక స్కిల్ డెవలప్ మెంట్ కళాశాలను ఏర్పాటు చేస్తారా లేదా అనే తేలాల్సి ఉంది. సాంకేతిక కళాశాలలకు సంబంధించిన టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల నియామకాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జులై నెలలోని సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. దీంతోపాటు ఈ నెల 18న జగనన్నతోడు, 21న నేతన్న నేస్తం, 26న డ్వాక్రా రుణాల సున్నావడ్డీ జమ, విదేశీవిద్య వంటి పథకాలకు నిధు లను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. కడప జిల్లాలో సుమారు 9,245 మంది నేతన్ననేస్తం, అన్నమయ్య జిల్లాలో సుమారు 6,672 మంది చేనేతలకు లబ్ధి చేకూర నుంది. ఇదే తరహాలో కడప, అన్నమయ్య జిల్లాల్లో వేలాది మంది డ్వాక్రా రుణాల వడ్డీమాఫీ కానుంది.28న జగనన్నతోడు లబ్ధిదారులకు లబ్ధి చేకూరనుంది.

కేంద్ర మంత్రి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ గిరీష అన్నారు. బుధవారం ఎస్‌పి గంగాధర్‌రావు, ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి కలెక్టర్ బిటి.కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం గడ్కరీ చేతుల మీదుగా సత్సంగ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలోని స్వస్థ్య హాస్పిటల్ ప్రారంభోత్సవ కానుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర మంత్రి మధ్యాహ్నం రెండు గంటలకు మదనపల్లె హెలిపాడ్‌కి చేరుకుంటారని అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా సత్సంగ్ ఫౌండేషన్ వారి స్వస్థ్య హాస్పిటల్‌కు చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎటువంటి లోపాలు జరగకుండా కార్యక్రమం విజయవంతమయ్యేలా పనులను చేపట్టాలనిసంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమానంతరం రోడ్డు మార్గం ద్వారా హెలిపాడ్‌కు చేరుకుంటారని అక్కడ నుంచి తిరుపతికి వెళతారని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మదనపల్లె ఆర్‌డిఒ మురళి, మదనపల్లె మున్సిపల్ కమిషనర్ ప్రమీల పాల్గొన్నారు.

బిటి గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, అధికారులు

బిజెపి ప్రభుత్వానికి పతనం తప్పదు : కాంగ్రెస్

మౌన సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీకి సంఘీభావంగా ఎపిసిసి ప్రెసిడెంట్ గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్ వద్ద మౌన సత్యాగ్రహదీక్ష నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ సంఘీభావ మౌనదీక్షకు మదనపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్, వై.సురేంద్రరెడ్డి, మహబూబ్ పీర్, సయ్యద్ ఖాసీం, గఫూర్, పీలేరు నియోజకవర్గం నుండి కలకడ మహమ్మద్ షరీఫ్, రాయచోటి నుండి మన్సూర్ అలీ, దర్బార్, సిఎల్‌పి అల్లాబకాష్ తదితర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ బిజెపి పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయని, అచ్చే దిన్ అంటూనే ప్రధాని మోడీ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని, ఇందుకు కర్ణాటక ఎన్నికల ఫలితాలు నిదర్శనమన్నారు. 2024లో జరిగే దేశసార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మౌన సత్యాగ్రహ దీక్షకు జిల్లా నలుమూలల నుండి తరలివచ్చి విజయవంతం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

చిన్న పిల్లల పార్క్ పనులు పరిశీలన

రాయచోటి టౌన్ : పట్టణంలోని డైట్ హాస్టల్ ప్రాంగణంలో నిర్మాణ దశలో ఉన్న మున్సిపల్ చిన్న పిల్లల పార్క్ పనులను బుధవారం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వాకింగ్ ట్రాక్, పార్క్, చిల్డ్రెన్స్ పార్క్, యోగ కేంద్రం, జిమ్ తదితర నిర్మాణాలపై ఆయన ఆరా తీశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్, పల్లా రమేష్, జిల్లా వ్యవసాయ సలహా సంఘ సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, సలీం పాల్గొన్నారు.

ఐటిఐలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు

రాజంపేట అర్బన్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటిఐ కళాశాలల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 31వ తేదీ లోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటిఐ జిల్లా కన్వీనర్, రాజంపేట ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసులు తెలియజేశారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో రెండవ దశ కౌన్సెలింగ్ కొరకు iti.ap.gov. in వెబ్ సైట్ నందు అంతర్జాలంలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా జరుగు రెండవ విడత అడ్మిషన్ ప్రక్రియలో అభ్యర్థులకు ఎటువంటి కాల్ లెటర్లు పంపించబోమన్నారు. ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో చేరదలచిన విద్యార్థులు ఆగస్టు 3, 4వ తేదీలలోనూ, ప్రైవేటు ఐటిఐ కళాశాలల్లో చేరదలుచుకున్న విద్యార్థులు ఆగస్టు 5 7వ తేదీలలో ఆయా కళాశాలల్లో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. **పీలేరు:** స్థానిక ఐటిఐలో రెండవ విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జి.సుబ్రమణ్యం తెలిపారు. టిఐలో రెండు సంవత్సరాల కోర్సులైన ఎలక్ట్రీషన్, ఫిట్టర్, ఒక్క సంవత్సరం కోర్సులైన డీజిల్ మెకానిక్, వెల్డర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చెక్కుల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నేడు అమ్మఒడి చెక్కుల పంపిణీ : గిరీష

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జగనన్న అమ్మఒడి మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గిరీష ఆదేశించారు. ఈ నెల 13న మదనపల్లెలోని టిప్పు సుల్తాన్ గ్రౌండ్స్‌లో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధుల సమక్షంలో జగనన్న అమ్మఒడి మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ గిరీష, ఎస్‌పి గంగాధర్ రావుతో కలిసి కార్యక్రమం పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కానున్నారని, దీనికి సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యవేక్షణలో కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా, మదనపల్లె ఆర్‌డిఒ మురళి, మదనపల్లి మున్సిపల్ కమిషనర్ ప్రమీల పాల్గొన్నారు.

లివర్ వ్యాధి బాధితుడికి ప్రభుత్వం చేయూత

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

సంబేపల్లె మండలం ప్రకాష్ నగర్ కాలనీ ఊటుపాలెకు చెందిన బొళ్ళెం సురేంద్రనాయుడు కుమారుడు మోక్షిత్ లివర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ చిన్నారి లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.10 లక్షలు విలువ చేసే ఎల్‌ఒసి లెటర్‌ను బుధవారం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందచేశారు. ఈ సందర్భంగా తండ్రి సురేంద్ర మాట్లాడుతూ మోక్షిత్ పుట్టిన రెండు నెలల తరువాత లివర్ వ్యాధి బయట పడడంతో తిరుపతి, చెన్నైలలో వైద్యం చేయించినా మెరుగుపడలేదని తెలిపారు. లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేస్తేనే ఆరోగ్యం మెరుగు అవుతుందన్నారు. ఇందుకు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని చెన్నై గ్లోబల్ ఆసుపత్రి వైద్యులు సూచించారన్నారు. నిరుపేదలైన తాము ఎమ్మెల్యేని కలిసి తమ బిడ్డ పరిస్థితి గురించి వివరించామన్నారు. ఇందుకు తక్షణం స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తామని భరోసా ఇచ్చి తమ దరఖాస్తును సిఎం క్యాంపు కార్యాలయానికి త్వరిత గతిన సిఫారసు చేసి లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం రూ.10 లక్షలు నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారని పేర్కొన్నారు. సిఎం జగన్, శ్రీకాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.



బాధితుడికి లెటర్ ఇస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యులు కోటేశ్వరరావు

పశుగ్రాస పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పాడి రైతులు పశుగ్రాస పెంపకంపై ఆసక్తి చూపాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరరావు అన్నారు. బుధవారం ముష్టూరులోని పశు వైద్య కేంద్రంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రోహిణి, స్థానిక పశు వైద్యులు డాక్టర్ సురేష్ లతో కలిసి నిర్వహించిన పశుగ్రాస వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మండల వ్యాప్తంగా పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల ఉత్పత్తిలో అధిక దిగుబడులు సాధించడానికి పప్పు జాతి, ధాన్యం జాతి, గడ్డి జాతి వంటి ప్రధాన పశుగ్రాసాలను పాడి రైతులు పశువులకు అందించాలని వివరించారు. అలసంద, పిల్లి పెసర, లూసర్న్ వంటి పప్పు జాతి గడ్డిలో మాంసకృత్తులు అధికంగా ఉంటాయని అన్నారు. జొన్న, మొక్కజొన్న వంటి ధాన్యం జాతి గడ్డిలో పిండి పదార్థాలు అధికంగా ఉంటాయని, వాటి సాగు విధానం పై పాడి రైతులకు అవగాహన కల్పించారు. గడ్డి కత్తిరించే యంత్రాలపైన, పాడి ఆవుల పరిశుభ్రత, పాలు పితికే విధానం పైన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ సాధుసురేష్, సిబ్బంది సి.ప్రతాప్, హరి, మల్లికార్జున్, పాడి రైతులు పాల్గొన్నారు.

డిఇఒకు క్షమాపణలు చెప్పాలి

- ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి-రామాపురం

కడప జిల్లా విద్యాశాఖ అధికారిపై నిందలు మోపుతూ వీరం శ్రీధర్‌రెడ్డి ఉపాధ్యాయ సంఘాల అధినేత వీరం సుబ్బారెడ్డి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సరైంది కాదని మండల ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రామాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దుర్ఘటన జరిగిన రోజు జిల్లాలోనే ఉన్న రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ ఈ విషయంపై ఆరాతీసి ఆ విద్యాసంస్థపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారన్నారు. నిబద్ధతతో సేవలందిస్తున్న డిఇఒపై బురద జల్లడం సబబు కాదన్నారు. ఆరోపణలు రుజువు చేయని పక్షంలో డిఇఒకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కసవర్తి శివశంకర్ రెడ్డి, కె.కుమారస్వామి, పి.ఎం.రవి, సి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎ.రామచంద్ర, యస్.రమేష్ రెడ్డి, డి.మధుసూదన్ రెడ్డి,హెచ్.గంగాధర్, సి.సుబ్బారెడ్డి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

బాధితుడిని పరామర్శించిన ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామం, బి.రాచపల్లెకు చెందిన మోపూరి రాజగోపాల్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది తన ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్‌రెడ్డి బుధవారం రాజగోపాల్ రెడ్డిని పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-గాలివీడు

యోగా చేస్తున్న విద్యార్థులు

యోగా చేయడం ద్వారా మన జీవితంలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను పొంద వచ్చని ఆయుష్ డిపార్ట్మెంట్ బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ యోగా టీచర్లు శ్రావణి, విష్ణుప్రియ పేర్కొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగా తరగతులను నిర్వహిస్తున్నారు. ఇప్పటి 900 పాఠశాలల్లో యోగా క్లాసులు ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే యోగ అలవాటు చేసుకోవడం ద్వారా వారి ఆరోగ్యాన్ని వారి రక్షించుకున్న వారవుతారని అన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

వీరబల్లి : వంగిమళ్ల పంచాయితీలో రేణుకాఎల్లమ్మ జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి ఆదివారం వరకు ఆరు రోజుల పాటు జరుగనున్నాయి. నాగిరెడ్డిపల్లి రమేష్‌రెడ్డి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మొదటి రోజు ఆలయ పూజారుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ పట్నాలు వేసి జమదగ్ని మహాముని కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. జాతరకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని రెండు గ్రామాల ఊర్లలో బ్యాండ్ భజంత్రీలు కోలాటాలతో డప్పు కోలాటాలతో ఊరేగించారు.కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు పాల్గొన్నారు.

వారంలోగా మొక్కలు నాటడం పూర్తికావాలి : పీడీ

ప్రజాశక్తి-పీలేరు

వారం రోజుల్లోగా మొక్కలు నాటే పనులు వంద శాతం పూర్తిచేయాలని జిల్లా డ్వామా పీడీ మద్దిలేటి తెలిపారు. బుధవారం పీలేరు మండలంలోని అగ్రహారం, బోడుమల్లువారిపల్లి పంచాయితీల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో మామిడి మొక్కలు నాటే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 200 ఎకరాల్లో తోటల పెంపకం లక్ష్యం కాగ, 350 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. ఇప్పటి వరకు 320 ఎకరాల్లో మొక్కలు నాటడానికి గోతులు తీసే పనులు పూర్తికాగా, కూడా అందులో ప్రస్తుతం 150 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటడం పూర్తయిందని తెలిపారు. మిగిలిన రెండు వందల ఎకరాలను వారం రోజు ల్లోగా వంద శాతం పనులు పూర్తి చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రైతులకు నచ్చిన, వారు మెచ్చిన మామిడి మొక్కలనే ఎంపిక చేసుకుని నాటడానికి అనుమతి నిస్తున్నట్లు చెప్పారు. తనిఖీల్లో మండల ఎపిఒ మహేష్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE SECOND ADDITIONAL DISTRICT JUDGE: MADANAPALLE
G.W.O.P. : 24/2023
Jalli Janakiram and Others.
...Petitioners/Plaintiff
And
Nil. ...Respondents/Defendants
Hearing Date: 21/08/2023
GENERAL NOTICE
ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిపై దావాలోని మైనర్ పిటీషనర్స్‌లకు చెంది వారి సంరక్షణకర్త వారి ఉన్నత చదువుల కొరకు విక్రయించదలచి కోర్టు సర్టిఫికేట్ పొందుటకు పై దావా దాఖలు చేసి ఉన్నారు.
పై దావా పైకోర్టులో తేది 21/08/2023న విచారణ కొరకు ఉన్నది. ఆక్షేపణదారులు ఎవరైనా ఉన్నచో ఆ దినం ఉ॥ 10గంటలకు పై కోర్టుకు హాజరై తెలుపుకొనగలరు. పై కోర్టు ఉత్తర్వుల మేరకు.
Schedule:
Chittoor District (Now Annamayya Dist), B.Kothakota Sub District, B.Kothakota Nagar, Panchayath, B.Kothakota Mandal, B.Kothakota Revenue Village Panjurammagudi Veedhi Extension 14th ward D.No.657&607 Paiki stone terraced house bearing D.No.14-145, HSC r4 including Vacant site etc.,
Bounded on the East: Middle of Meer Sab;
West: Two Feet Joint Passage; North: Seven Feet width Sandhu Passage; South: 3 1/2 Feet Width Sandhu dova; with in these boundaries measuring East to West 23 feet or 7.22 Mts., North to South 29 1/2 Feet or 8.995 mts comprising of 77.585 Sq. Ads Constructions and vacant site full.
Md.AYUB, B.USHA,
Advocates,
Madanapalle.

మహారాజ రాజశ్రీ పీలేరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు
O.S.No. 19 of 2013
పి.సరస్వతి మరియు ఇంకొకరు.
...వాదులు
Vs
పి.శ్రీనివాసులు.
...ప్రతివాది
ప్రతివాదికి నోటీసు
ప్రతివాది:
పెమ్మా శ్రీనివాసులు, S/o పెమ్మా సిద్ధయ్య, డోర్‌నెం.1-83, మిద్దెపైన, కొత్తపేట, గుర్రంకొండ గ్రామం, పోస్ట్ & మండలం, అన్నమయ్య జిల్లా.
పై కనిన వాదులు దాఖలు చేసిన పై దావాలో మీ హాజరు నిమిత్తమై తేది: 10.08.2023న వాయిదా వేసిఉన్నారు. కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని కోర్టు నందు తేది: 10.08.2023న ఉదయం 10.30 గంటలకు పై కోర్టు ఎదుట హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను. లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.
//By Court Order//
M.BHAVANI SANKARA
Advocate,
PILER.

భూ నిర్వాసితులను ఆదుకుంటాం : జెసి

ప్రజాశక్తి-కురబలకోట

ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూ నిర్వాసితుల బాధితులు నష్టపోకుండా న్యాయం చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ పర్మాన్‌అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని పిచ్చల వాండ్లపల్లె, వద్ద నిర్మిస్తున్న ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు పరిశీలించారు. అనంతరం భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు అన్ని విధాలా ఆదుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులు నచ్చి మెచ్చేలా పరిహారంపై పునరావాసం ఉంటుందన్నారు. ఎవ్వరూ బాధపడకుండా నష్టపరిహారం, ఆర్అండ్‌కాలనీ నిర్మిస్తామని చెప్పారు. భూములిచ్చిన రైతుల త్యాగాన్ని ఎప్పటికీ మరువలేరన్నారు. ఈ రిజర్వాయర్‌కు ముదివేడు, పిచ్చలవాండ్లపల్లె, కోటావూరు, కురులకోట గ్రామాల రైతుల భూములు 1075.81 ఎకరాలు పోతున్నాయని చెప్పారు. మండలానికి చెందిన వారికి ముదివేడు దగ్గరున్న ఎంఐజి లేఅవుట్ పక్కన 30 ఎకరాల్లో ఆర్ అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేస్తారని తెలిపారు. బి. కొత్త మండలానికి చెందిన వారికి కాండ్లమడుగు క్రాస్ వద్ద ఏర్పాటు చేస్తారన్నారు. గుడి, బడి, తాగునీరు, మురికినీటి కాలువలు, ఆస్పత్రి, పశువుల ఆస్పత్రి, కమ్యూనిటీహాల్, విశాలమైన రోడ్లు, సచివాలయం, ఎటిఎంతో పాటు సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతి బాధితుడికి ఐదు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు పక్కా ఇళ్ళు నిర్మించి ఇస్తామన్నారు. లేకుంటే ఒటిఎస్ కింద రూ. 8.60 లక్షలు అందిస్తామని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టిలకు అదనంగా మరో రూ.50 వేలు పరిహారం అందుతుందన్నారు. బాధిత రైతులకు సంతృప్తికరంగా పునరావాసం ఉంటుందన్నారు. ముదివేడు సచివాలయాన్నీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎఎన్ఎంతో మాట్లాడుతూ గర్భిణులకు ప్రతి నెలా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకో వాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ దిలీప్‌కుమార్, తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, పిఆర్ఒ కులదీప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ బాధిత రైతులతో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్

వాలంటీర్లపై పవన్ వ్యాఖ్యలు అర్థరహితం : 'మేడా'

ప్రజాశక్తి : రాజంపేట రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

వాలంటీర్లను గురించి మాట్లాడే అర్హత పార్ట్ టైం పొలిటీషియన్ పవన్‌కళ్యాణ కు లేదని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మండలం మిట్టమీదపల్లి గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జగనన్న సురక్ష కార్యక్ర మంలో అర్హులైన 123 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. వాలంటీర్ల ద్వారా అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ పథకాలను అందిస్తా మన్నారు. పవన్ వ్యాఖ్యలకు వాలంటీర్లు అధైర్య పడనవసరం లేదన్నారు. కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు రామ్మోహన్‌నాయుడు , రాజంపేట గ్రామీణ జెసిఎస్ కన్వీనర్ మందరం గంగిరెడ్డి, జడ్‌పిటిసి ప్రతినిధి దాసరి పెంచలయ్య, ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్ నాయుడు, కె.వెంక టేష్, నరసింహులు, పోలి మురళీరెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు. కార్య క్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండలంలోని అప్పయ్యరాజుపేట గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాల అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామ ప్రజలు వివిధ సమస్యలను ఎమ్మెల్యే, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డిల దృష్టికి తీసుకొని రాగా రూ.20 లక్షలు మం జూరు చేస్తామని మండల కన్వీనర్ ముస్తాక్ హామీ నిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్టీ సీనియర్ నాయకులు కొల్లంగంగిరెడ్డి, ఎపిఎస్‌సి వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మడ గలం శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సల హాదారు సంఘం చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు బికె మణి, మల్లికార్జున్, భాస్కర్, తహశీల్దార్, గ్రామ సచి వాలయ సిబ్బంది పాల్గొన్నారు. **సుండుపల్లి :** వాలంటీర్లపై జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని జెసిఎస్ కన్వీనర్ రహమాన్‌ఖాన్ డిమాండ్ చేశారు. మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో వాలంటీర్లతో కలిసి సమా వేశం నిర్వహిం చారు. పవన్ దిష్టి బొమ్మ ను దగ్ధం చేసి నిరసన చేపట్టారు. అనం తరం ఎంపిడిఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జి రాజశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. **మదనపల్లె అర్బన్ :** వాలం టీర్లపై జనసేన అదినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామ వార్డు వాలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్య కులు పూజారి ఉదయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు నీరుగట్టి రాజేష్, జిల్లా అధ్యకులు జమాల్‌వల్లి, మండల అధ్యకులు వెంకటపతిలు తెలిపారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి పవన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఎఒకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎపిఎండిసి చైర్‌పర్సన్ జి.షమీంఅస్లాం, కౌన్సిలర్ బిఎ.ఖాజా, కరీముల్లా, వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎఒ చంద్రనాయక్

విత్తనశుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి-రామాపురం

పంట సాగు చేసే రైతులు చూసి విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని సరస్వతిపల్లి రైతుభరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగుచేస్తున్న పంటలపై దృష్టి సారిం చాలన్నారు. పంట వేసే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు, పురుగుమందులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా రైతు భరోసా కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. పిఎం కిసాన్ నగదు జమ కావాలంటే తప్పనిసరిగా రైతులు ఇకెవైసి చేయించుకోవాలన్నారు. అర్హులైన ప్రతి కౌలు రైతుకు కూడా సిసిఆర్‌సి కార్డులు అందాలని సూచించారు. కార్యక్రమంలో మురళీధర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సిఎం జగన్ రైతు పక్షపాతి

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మిట్టమీదపల్లె గ్రామంలో సూక్ష్మ నీటి సాగు పథకం డిఎంఐఒ ఆధ్వర్యంలో సబ్సిడీ ద్వారా రైతులకు డ్రిప్ పరికరాలు, స్పింక్లర్లు, పివిసి పైపులు 90 శాతం రాయితీతో అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్నివిధాల ఆదుకుంటోందని అన్నారు. రైతులు కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి పాటుపడుతోందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు రామ్మోహన్‌నాయుడు, దాసరిపెంచలయ్య, నాగేశ్వర్ నాయుడు, కే.వెంకటేష్, కే.నరసింహులు, కుందా నెల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి డైరెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి, దండు గోపి, సుబ్బా రాయుడు, జయరాం, పోలి మురళిరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

డెంగీ నివారణకు చర్యలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

డెంగీ జ్వర నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లా ఖాన్ అన్నారు. బుధవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు తవళం, రెడ్డివారిపల్లె సచివాలయంలో జరిగిన మాతృత్వ, వ్యాధి నిరోధకాల కార్యక్రమం అమలును పర్యవేక్షణ చెశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ ఆదేశాల మేరకు సబ్‌యూనిట్ అధికారి పి.ఖలీలుల్లాఖాన్ డెంగీ జ్వర వ్యాప్తి నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులై నెలలో డెంగీ వ్యతిరేక మాసో త్సవాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి ఇంటింటిలో ప్రతి శుక్రవారం జరిగే ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. జూలై నెల నుంచి సాధారణంగా దోమలు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. దోమల లార్వాలు వృద్ధిచెందకుండా ముందస్తుగా వారానికి ఒక్కసారైనా నీటి తొట్టెలు, కుండలు, డ్రమ్ములు నిల్వ ఉన్న నీటిని శుభ్రపరచాలన్నారు. ఇంటిపరిసరాలలో పడవేసిన టైర్లు, కొబ్బరి చిప్పలు, టీకప్పులు, గాజుపెంకులు వంటివి లేకుండా చూడాలనీ సూచించారు. పూల కుండీలు, ఎయిర్ కూలర్లలో, పూలకూండీలలో తరచూ నీరు మార్చుతూ లార్వా లేకుండా చూడాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో చెత్తాచెదారం నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాలలో క్రమం తప్పకుండా ఫీవర్ సర్వేలు చేయాలన్నారు. జ్వరం వచ్చినవారు వెంటనే సమీప ఆరోగ్య కేంద్రం నందు చికిత్స చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమములో డాక్టరు పి.దీక్షితరాణి, ఆరోగ్యవిస్తరణఅధికారి బి.రామచంద్ర, ఆరోగ్య పర్యవేక్షకులు జె.దేవేంద్ర, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బడి బయట ఉన్న విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఇఒలు

బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

పాఠశాల విద్యార్థుల స్థూల నమోదు సర్వే వందవ రోజును పురస్కరించుకొని ఎంఇఒల ఆధ్వర్యంలో బుధవారం బడి బయట పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు పి.రెడ్డి భాషా, డి.సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ మండలంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటిదగ్గర ఉంచుకోకుండా ఖచ్చితంగా తమ సమీపం లోని పాఠశాలలో చేర్పించి ప్రతి రోజూ బడికి పంపాలని కోరారు. ఏ ఒక్క విద్యార్థి నిరక్షరాస్యులుగా ఉండరాదని తెలిపారు. ఈ సందర్భంగా చీనేపల్లి ఉన్నత పాఠశాలలో వైకెపల్లి కాలనీకి చెందిన బడి మానేసిన పి. కైలాష్ అనే విద్యార్థిని 9వ తరగతిలో చేర్పించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ప్రధా నోపాధ్యాయులు ఎం.ఉపనీత, సిఆర్‌పి కే.రవీంద్ర, వాలంటీర్ శారద, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, రాజంపేట ఎంపీ పెద్దరెడ్డి మిథున్‌రెడ్డిల మదనపల్లి పర్యటనను విజయవంతం చేయాలని వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్.ఐ.రమణారెడ్డి తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మంత్రి, ఎంపీలు గురువారం మదనపల్లిలో పర్యటిస్తూ మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి పలు కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 10 గంటలకు మదనపల్లి పట్టణం కదిరిరోడ్డు లోని టిప్పుసుల్తాన్ మైదానంలో అమ్మఒడి పథకం కింద లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరితో కలసి నక్కలదిన్ని పొన్నేటి పాలెం రోడ్డులో సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎం.ముంతాజ్‌అలీ వారి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన స్వస్థ్య ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

నర్సరీ యజమానులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

షట్‌నెట్ కూరగాయల నర్సరీ నిర్వహణకు నియమ నిబంధనలు పాటించాలని ఉద్యానవనశాఖాధికారి వి.తేజస్విని తెలిపారు. తంబళ్లపల్లి, పెద్దమండెం, కురబలకోట ఏర్పాటు చేసిన షెడ్యూల్ నర్సరీలను బుధవారం పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఉపయోగించాలి రిజిస్టర్లను నిర్వహించాలని చెప్పారు. మొక్కలు విక్రయించి నసమయంలో విత్తనం తాలూకు పూర్తి సమాచారంతో రశీదులను అందించాలన్నారు. నర్సరీ పేరు కనిపించేలా ప్రత్యేక సూచనలు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీ లైసెన్స్ నెంబర్ ప్రింట్ అయిన బిల్లులు మాత్రమే రైతులకు అందివ్వాలన్నారు. నిబంధనలు పాటించని నర్సరీలపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. **రామసముద్రం :** మండలంలో రోజూ రోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కూరగాయలు నర్సరీల యజ మానులు నాణ్యతలేని విత్తన నారలు పెంచి రైతులకు అమ్ముతున్నారని రైతులు నుండి సమాచారం రావ డంతో ఉద్యానశాఖ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి మండలంలోని దాదాపు 50 కూరగాయల నర్సరీలు పరిశీలించి నిర్వాహకులకు నోటీసులు జారీచేశారు.నోటీసులు అందిన ప్రతి యజమాని 30 రోజులు లోపు ఎంపిఈఓ , ఉద్యాన శాఖ అధికారులు సహాయంతో రిజిస్ట్రేషన్ చేసుకోని అనుమతులు పొందాలని తెలిపారు.

నర్సరీ యజమానికి నోటీసును అందిస్తున్న ఉద్యానవనశాఖ అధికారి

గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. బుధవారం కొండయ్యగారిపల్లి పంచాయతీలోని గుర్రెడ్డిగారిపల్లిలో సర్పంచు ఆర్.వరలక్ష్మి శశిధర్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపి జయప్రకాశ్‌రెడ్డి, నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పలువురు త్రాగునీటి పైపులైన్లు, సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలను, విద్యుత్ స్తంభాలు వేయించాలని, రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని వెంటనే పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం, చంద్రాయుడు, వైసిపి నాయకులు నరేంద్ర రెడ్డి, శశిధర్ రెడ్డి, సివి రమణారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, నవీన్, హేమంత్, పంచాయతీ కార్యదర్శి మంజునాథ్, ఎస్‌ఐ రామకృష్ణ, ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రేపు వాహనాలకు వేలం పాట

ములకలచెరువు : మండల కేంద్రమైన ములకలచెరువు ఎస్ఇబి స్టేషన్‌లో శుక్రవారం వాహనాలు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ మల్లిక విలేకరులకు తెలిపారు. ఈ వేలంపాటలో రెండు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో వెయ్యి రూపాయలు టోకెన్ చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం

ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రభుత్వం నుంచి వచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్ఆర్ క్రాంతిపథం సహాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఖాదర్‌వలి కోరారు. బుధవారం సోమవరం వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. సంఘాలకు బ్యాంకు, స్త్రీనిధి, సిఐఎఫ్, ఉన్నతి సంస్థల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని వీటి ద్వారా జీవనోపాధి మెరుగు పరుచుకోవాలన్నారు. జీవనోపాధి కొరకు సంఘాల సభ్యులకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ రుణాలు వ్యక్తిగతంగా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రుణాలు సక్రమంగా చెల్లించే గ్రామాలలోని సంఘాలకు రుణాలు ఇవ్వడంలో అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. చిన్న పరిశ్రమల అభివృద్ధికి రూ.10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామ సమాఖ్యలో పొందిన రుణాలు ప్రతినెల క్రమం తప్పకుండా చెల్లించి రశీదు పొందాలన్నారు. కార్యక్రమంలో సిసినాగేంద్ర, విఒఎ విజయ, సమాఖ్య అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి రాధిక, కోశాధికారి రెడ్డమ్మ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పవన్‌ను విమర్శించడం సరికాదు

మదనపల్లె అర్బన్: వాలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి ఆయన దిష్టిబొమ్మలను దగ్ధం చేసి విమర్శించడం సరికాదని జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణం పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేసిన ప్రదేశమైన అనిబిసెంట్ సర్కిల్‌లో పవన్ చిత్రపటానికి జన సైనికులు, వీర మహిళలు పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనసేన నాయకులు శ్రీరామరామాంజనేయులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ వాలంటీర్లకు అనుకూలంగానే వ్యాఖ్యలు చేశారని అన్నారు. వాలంటీర్లను ప్రభుత్వం తమ స్వార్థానికి వాడుకుంటోందని చెప్పారని తెలిపారు.కార్యక్రమంలో దారంహరి ప్రసాద్, వీర మహిళలు చంద్రకళ, స్వాతిహరిహరన్, రమణారెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, వినయ్ కుమార్‌రెడ్డి, బిసి అశ్వత్, రమాదేవి, సాగర్, మధురాజా, రవి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** వాలంటీర్లను రెచ్చగొట్టి పవన్‌కల్యాణ్ పై బురద జల్లడం సబబు కాదని జనసేన పార్టీ రాజంపేట ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద మహాత్ముడికి పూలమాలతో నివాళి అర్పించి పవన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఉద్యోగ అవకాశాలను సృష్టించి వాలంటీర్లను వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించి, ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని గమనిస్తున్నారని, రానున్న రోజులలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర చేనేత కార్యదర్శి రాటాల రామయ్య, నాయకులు భాస్కర్ పంతులు, నంద్యాల హరి, పోలిశెట్టి శ్రీనివాసులు, చౌడయ్య, చంగల్ రాయుడు, గోపాల్, వీర మహిళలు జండా శిరీష, మాధవి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నిల్చున్న లారీని ఢీకొన్న కారు

- ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని చిట్లూరు పంచాయతీ పాలనగారిపల్లి సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఆగివున్న లారీని కారు ఢీ కొనడంతో ఆరుగురికి గాయాలైనట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..రాయచోటి పట్టణం బోస్‌నగర్‌కు చెందిన ఫజూర్‌రహిమాన్, సమిరా, ముగ్గురు పిల్లలతో కలిసి కడప నుంచి రాయచోటి వైపుకు పోతుండగా పాలనగారిపల్లి సమీపం వద్ద రోడ్డుపై ఆగివున్న లారీని ఢీకొట్టినట్లు చెప్పారు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగిరికి గాయాలైనట్లు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. తీవ్రంగా గాయపడిన ఫజూర్ రహిమాన్, సమీరాల పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి పంపినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసులో నింధితుడు అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు

ఒంటరిగా ఇంట్లో ఉన్న బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నింధితుడు విజయ్‌కుమార్(30) పైన ఎస్ఐ గాయత్రి పోక్సో కేసు నమోదు చేసిన విషయం విధితమే. ఈ కేసులోని నింధితుడైన విజయ్‌కుమార్(30)ను బుధవారం తంబళ్లపల్లె క్రాస్ వద్ద ఉండగా అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని బురకాయలకోట పంచాయతీ లింగప్పబావుల వద్ద పేకాట శిబిరంపైన ముందస్తు సమాచారం ఎస్ఐ గాయత్రి సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులో రూ.18,860 నగదును స్వాధీనం చేసుకొని ముగ్గురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. నగదును సీజ్ చేసి జూదరులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.